తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక


epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

సంపుటి: 02
సంచిక:71

24 క్యారెట్లు 145,457.00 | కిలో వెండి 1,20,547.00 | chourastha Digitals | 11.11.2026 బుధవారం, హైదరాబాద్

మూడు దశాబ్దాలైనా.. రాజీవ్ హత్య ఫొటో చూడలేదు

- ఆ విషాద జ్ఞాపకాన్ని ఇప్పటికీ దూరంగా ఉంచుతున్నా..
- ఆత్మకథ 'బిలాంగింగ్'లో సోనియా గాంధీ భావోద్వేగ వెల్లడి



2లో





పగలు ఎండల తీవ్రత.. రాత్రి చలి పంజా

ఎల్‌నినో ప్రభావంతో మారుతున్న వాతావరణ పరిస్థితులు

- పగటిపూట 35 డిగ్రీలకు చేరుతున్న ఉష్ణోగ్రతలు
- సాధారణం కంటే 4 డిగ్రీలు అధికంగా ఎండలు
- రాత్రివేళ 14 డిగ్రీలకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత
- హైదరాబాద్‌లో 17 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- మరో రెండు నెలలు ఇదే వాతావరణ పరిస్థితులు?
- పగటి వేడి.. రాత్రి చలి మధ్య ఉక్కిరిబిక్కిరి

రాష్ట్రంలో వాతావరణం భిన్నంగా మారుతోంది. పగటిపూట ఎండలు మండిపోతుండగా.. రాత్రివేళ చలి తీవ్రత పెరుగుతోంది. సాధారణంగా ఈ సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గాల్సి ఉన్నప్పటికీ, పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయి.

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

మరోవైపు రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు తక్కువగా నమోదవుతున్నాయి. ఈ పరిస్థితులకు ఎల్‌నినో ప్రభావం ప్రధాన కారణమని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు వెల్లడించారు. ప్రస్తుతం ఎల్‌నినో తీవ్ర దశలో కొనసాగుతున్న నేపథ్యంలో రానున్న రెండు నెలల పాటు

।మిగతా 2 లో।

తెలంగాణ సాగునీటి హక్కులపై సీఎం ప్రత్యేక దృష్టి



రెండు టీఎంసీల నీటినే తరలించలేని పరిస్థితి

అదనపు టీఎంసీపై అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి

సీడబ్ల్యూసీ అనుమతులు వచ్చాకే తదుపరి అడుగులు

సుప్రీంకోర్టు కేసుల పురోగతిపై సీఎం ఆరా

- భూసేకరణకు ముందు న్యాయపరమైన అంశాల పరిశీలన
- కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కుల సాధనకు కసరత్తు
- ఏపీతో వివాదాలపై పక్కా ఆధారాలు సిద్ధం చేయాలి
- ఈ నెల 18న సుప్రీంకోర్టులో కీలక విచారణ
- డిండి, అచ్చంపేట ప్రాజెక్టులకు వేగం పెంచాలి
- ఏదుల రిజర్వాయర్ నుంచి సాగునీటి తరలింపునకు ప్రణాళిక
- నార్లాపూర్–ఏదుల మధ్య 0.6 టీఎంసీల తరలింపునకు డీపీఆర్
- ప్రాజెక్టుల విషయంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి
- కాళేశ్వరం అదనపు టీఎంసీపై ఆచితూచి అడుగులు



"కాళేశ్వరం ప్రాజెక్టు అదనపు టీఎంసీ పనుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, బాధ్యతాయుతంగా ముందుకు వెళ్లాలని సూచించారు.

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

ప్రస్తుతం రెండు టీఎంసీల నీటినే తరలించలేని పరిస్థితి ఉన్నందున అదనపు టీఎంసీ పనులపై అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇరిగేషన్ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయవాది వైద్యనాథన్‌తో పాటు పలువురు అధికారులు, న్యాయ నిపుణులు హాజరయ్యారు.

కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులకు సంబంధించి సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని పరిశీలించిన తర్వాతే భూసేకరణ ప్రక్రియ చేపట్టాలని సీఎం సూచించారు.

కేంద్ర జల సంఘం

।మిగతా 2 లో।

హోదా పెరిగినా.. గతాన్ని మర్చిపోవద్దు

- అధికారుల పనితీరు,నిర్ణయాలే ప్రభుత్వ ప్రతిష్ఠకు గీటురాయి
- నూతన డీఎస్పీలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- ప్రజల సమస్యలను ఓపికగా వినాలని సూచన
- సైబర్ నేరాలతో పాటు డ్రగ్స్ నియంత్రణ ప్రత్యేక దృష్టి సారించండి
- నిజాయితీగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి
- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యం



2లో

"ఏ హోదాలో ఉన్నా మన గతాన్ని, మనం వచ్చిన నేపథ్యాన్ని మర్చిపోవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నూతన డీఎస్పీలకు సూచించారు. అధికారుల పనితీరు, నిర్ణయాలే ప్రభుత్వ ప్రతిష్ఠకు గీటురాయిగా మారుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లపాటు ముందుకు నడిపించే బాధ్యత యువ అధికారుల చేతుల్లోనే ఉందని అన్నారు.పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది నూతన డీఎస్పీలతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువ అధికారులకు విధి నిర్వహణ, ప్రజల పట్ల బాధ్యత, పోలీస్ శాఖ ప్రతిష్ఠ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు.

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా

హసీనాకు చుట్టుముడుతున్న ఉచ్చు..

- పాస్‌పోర్టుపై బంగ్లా సర్కార్ స్పష్టత
- షేక్ హసీనాకు మరో అవకాశం లేనట్టేనా?
- మరణశిక్ష అమలే తదుపరి మార్గం..
- కొత్త పాస్‌పోర్టు, ప్రయాణ పత్రాలు జారీ చేయలేం
- బంగ్లాదేశ్ ప్రాసిక్యూటర్

తెలంగాణ చౌరస్తా, వెబ్ డెస్క్ :

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు కొత్త పాస్‌పోర్టు లేదా ప్రయాణ పత్రాలు జారీ చేసే అవకాశం లేదని ఆ దేశ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ చీఫ్ ప్రాసిక్యూటర్ ఎండీ అమీన్ ఉల్ ఇస్లాం స్పష్టం చేశారు. ఆమెకు విధించిన మరణశిక్ష నేపథ్యంలో చట్టపరంగా ఎలాంటి ఉపశమనం లభించే అవకాశం లేదని వ్యాఖ్యానించారు. మరణశిక్ష పడిన వ్యక్తికి పాస్‌పోర్టు జారీ చేసేందుకు చట్టంలో అవకాశం లేదని పేర్కొన్నారు.



షేక్ హసీనా తరఫున కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు కోసం అభ్యర్థన వచ్చిన నేపథ్యంలో ప్రాసిక్యూటర్ ఈ వ్యాఖ్యలు చేశారు. దిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్‌ను ఆమె ఆశ్రయించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. లండన్‌కు చెందిన మ్యాట్రిక్స్ ఛాంబర్స్ న్యాయ సంస్థ ద్వారా ఈ అభ్యర్థన పంపినట్లు సమాచారం. డిసెంబరులో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి తనపై ఉన్న కేసులను ఎదుర్కోవాలని ఆమె భావిస్తున్నట్లు

।మిగతా 3 లో।

తెలంగాణలో అధికారమే లక్ష్యం..

- బీజేపీలో పదవుల పందేరానికి కసరత్తు!
- అసంతృప్త నేతలకు అధిష్ఠానం నుంచి ప్రాధాన్యం
- రాష్ట్ర కమిటీలో మరో ఐదు పదవుల సృష్టికి యోచన
- కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకతను అనుకూలంగా మలుచుకునే వ్యూహం
- జిల్లాల వారీగా పార్టీ విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ
- కీలక బాధ్యతల కోసం సీనియర్ నేతల్లో పోటీ
- కొత్త పదవుల భర్తీపై అధిష్ఠానం కసరత్తు
- రాష్ట్రంలో పట్టు పెంచుకునేందుకు బీజేపీ కొత్త ప్రణాళిక



తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :

తెలంగాణలో రాజకీయంగా పార్టీని బలోపేతం చేయడంతోపాటు వచ్చే ఎన్నికల్లో అధికారాన్ని లక్ష్యంగా చేసుకుని బీజేపీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. ఈ క్రమంలో రాష్ట్ర పార్టీ సంస్థాగత నిర్మాణంలో మార్పులు, కొత్త పదవుల భర్తీపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో వివిధ కారణాలతో పదవులు దక్కని నేతలకు ఈసారి అవకాశం కల్పించాలని జాతీయ నాయకత్వం భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

తెలంగాణ బీజేపీలో ప్రస్తుతం ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, ఎనిమిది మంది ఉపాధ్యక్షులు, ఎనిమిది మంది కార్యదర్శులు కొనసాగుతున్నారు. వీటికి అదనంగా మరో జనరల్ సెక్రటరీ, ఇద్దరు కార్యదర్శులు, ఇద్దరు ఉపాధ్యక్షుల నియామకానికి పార్టీ నాయకత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. దీంతో కొత్తగా ఐదు పదవులు అందుబాటులోకి వచ్చే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ఈ పదవుల కోసం పలువురు ఆశావహులు ఇప్పటికే తమ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.గతంలో పార్టీలో కీలక బాధ్యతలు ఆశించి నిరాశకు గురైన నేతలకు ఈసారి ప్రాధాన్యత ఇవ్వాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. పార్టీ కోసం చేసిన కృషి, సంస్థాగత అనుభవం, అప్పగించిన బాధ్యతల నిర్వహణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నియామకాలు చేపట్టే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో కొందరు నేతలు రాష్ట్ర, జాతీయ నాయకత్వం దృష్టిలో

।మిగతా 2 లో।



మత్తులో మునుగుతున్న యువత..

చీకట్లోకి భవిత

- సవాల్‌గా మారుతున్న ఫామ్‌హౌస్ పార్టీలు!
- సరదాగా మొదలై వ్యసనంగా మారుతున్న మత్తు అలవాట్లు..
- బర్త్‌డే, వీకెండ్ పార్టీల పేరుతో డ్రగ్స్ వినియోగం
- ఒకేసారి 108 మంది విద్యార్థులు పోలీసుల అదుపులోకి 2 వేల మందికి పరీక్షలు
- 1,400 మందికి డ్రగ్స్ పాజిటివ్
- యువత, భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్న నిపుణులు

తెలంగాణ చౌరస్తా ప్రత్యేక కథనం :

చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాల్సిన యువత మత్తు పదార్థాలకు బానిసవుతూ తమ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారు. స్నేహితుల పరిచయాలు, సరదా పార్టీలతో మొదలవుతున్న అలవాట్లు క్రమంగా వ్యసనాలుగా మారుతున్నాయి. సిగరెట్, మద్యంతో మొదలై గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వరకు వెళ్తున్నారు. ముఖ్యంగా నగర శివారు ప్రాంతాల్లో ఫామ్‌హౌస్ పార్టీల పేరుతో జరుగుతున్న వ్యవహారాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల పరుసగా వెలుగులోకి వచ్చిన ఫామ్‌హౌస్ ఘటనలు యువతలో డ్రగ్స్ వినియోగం ఏ స్థాయికి చేరుతోందో స్పష్టం చేస్తున్నాయి.నగర శివారు ప్రాంతాల్లో మత్తు పదార్థాల వినియోగంపై పోలీసులకు రోజూ 10 నుంచి 15 వరకు ఫిర్యాదులు అందుతున్నట్లు సమాచారం. ఆపరేషన్ కవచ్‌లో భాగంగా ఈ ఏడాది ఇప్పటివరకు 2 వేల మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, 1,400 మందికి పాజిటివ్‌గా తేలినట్లు వెల్లడైంది. సుమారు 60 శాతం మందిలో మత్తు పదార్థాల వినియోగం గుర్తించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. సిగరెట్‌తో మొదలయ్యే

।మిగతా 2 లో।

హోదా పెరిగినా.. గతాన్ని మర్చిపోవద్దు

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

ఏ హోదాలో ఉన్నా మన గతాన్ని, మనం వచ్చిన నేపథ్యాన్ని మర్చిపోవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నూతన డీఎస్పీలకు సూచించారు. అధికారుల పనితీరు, నిర్ణయాలే ప్రభుత్వ ప్రతిష్ఠకు గీటురాయిగా మారుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లపాటు ముందుకు నడిపించే బాధ్యత యువ అధికారుల చేతుల్లోనే ఉందని అన్నారు.పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది నూతన డీఎస్పీలతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువ అధికారులకు విధి నిర్వహణ, ప్రజల పట్ల బాధ్యత, పోలీస్ శాఖ ప్రతిష్ఠ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, భద్రతా సలహాదారు శివధర్‌రెడ్డి, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులను గౌరవంగా కూర్చోబెట్టి, వారి సమస్యలను ఓపికగా వినాలని సీఎం సూచించారు. బాధితులతో సానుకూలంగా మాట్లాడితే సగం సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయని అన్నారు. ఎన్నో అవాంతరాలు, కష్టాలను అధిగమించి ఉద్యోగాలు సాధించిన




యువ అధికారులు తమ మూలాలను మర్చిపోకుండా ప్రజలకు సేవ చేయాలని హితవు పలికారు. పది మంది డీఎస్పీలు తప్పుగా వ్యవహరించినా మొత్తం ప్రభుత్వ పాలనపై విమర్శలు వచ్చే అవకాశం ఉందని సీఎం పేర్కొన్నారు. శాంతిభద్రతలు క్షీణించాయని, అవినీతి పెరిగిందనే ఆరోపణలు కూడా పోలీసుల పనితీరుపైనే ఆధారపడి వస్తాయని అన్నారు. పోలీసులు నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు పోలీసులకు అతిపెద్ద సవాలుగా మారాయని సీఎం తెలిపారు. సైబర్ నేరాలతో పాటు డ్రగ్స్ నియంత్రణ, ఆహార భద్రత, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సైబర్ క్రైమ్, ఫోరెన్సిక్ విభాగాలపై ఆసక్తి ఉన్న డీఎస్పీలను విదేశాలకు పంపించి ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని వెల్లడించారు. అధికారులు ఫిట్‌నెస్ విషయంలో రాజీపడకూడదని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సరదాగా సూచించారు.పోలీస్ శాఖపై ప్రభుత్వం ఎలాంటి అనుచిత అంచనాలు పెట్టుకోవడం లేదని, ఎన్నికల్లో రిగ్గింగ్ చేయాలనే ఆదేశాలు ఇవ్వడం లేదని సీఎం స్పష్టం చేశారు. నిజాయితీగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని మాత్రమే ఆశిస్తున్నామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో సీనియర్ పోలీసు అధికారులు ఎంతో కృషి చేసి శాఖ గౌరవాన్ని పెంచారని, అదే విశ్వసనీయతను యువ అధికారులు కొనసాగించాలని కోరారు.గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు తీవ్ర జాప్యానికి గురయ్యాయని సీఎం విమర్శించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చి, సరైన అవగాహన లేని వారిని బోర్డులో నియమించడం వల్ల నిరుద్యోగులకు నష్టం జరిగిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కమిషన్‌ను ప్రక్షాళన చేసి, యూపీఎస్సీ తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. 563 గ్రూప్ 1 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా 562 మంది ఉద్యోగాల్లో చేరారని సీఎం వివరించారు. 2011 నుంచి 2025 వరకు గ్రూప్1 నియామకాల ప్రక్రియలో అనేక సమస్యలు, గందరగోళాలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. నియామకాలపై వచ్చిన వివాదాలను ఎదుర్కొంటూ సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడి అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. 112 మంది డీఎస్పీల నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని, కొందరు తప్పుడు ఆరోపణలు చేసినప్పటికీ అభ్యర్థులకు అండగా నిలిచామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలపై రాజకీయ విమర్శలు సహజమేనని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.'ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. గత 30 ఏళ్లతో పోలిస్తే రాబోయే 30 ఏళ్లు పోలీస్ శాఖకు అత్యంత కీలకమని అన్నారు. సైబర్ మోసాలు, ఆహార కల్తీ వంటి కొత్త సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేలా యువ డీఎస్పీలు సిద్ధం కావాలని సూచించారు. యువ అధికారులకు ప్రభుత్వం, పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తాయని భరోసా ఇచ్చారు.



పగలు ఎండల తీవ్రత..
రాత్రి చలి పంజా

తరువాయి భాగం


ఇదే తరహా వాతావరణ పరిస్థితులు ఉండే అవకాశం ఉందని శ్రీనివాస్‌రావు తెలిపారు. పగటిపూట భూమి గ్రహించిన వేడిని రాత్రివేళ తిరిగి ఆకాశంలోకి విడుదల చేయడం వల్ల రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతున్నాయని వివరించారు.ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోనూ ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. మహబూబ్‌నగర్‌లో ఇప్పటికే సుమారు 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోందని, ఇది సాధారణం కంటే 4 డిగ్రీలు ఎక్కువని తెలిపారు. రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 14 నుంచి 20 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, మంచిర్యాల, కుమురం భీం జిల్లాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. అటవీ ప్రాంతాలు కావడంతో ఈ జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారి వివరించారు. రాజధాని హైదరాబాద్‌లో ప్రస్తుతం కనిష్ఠ ఉష్ణోగ్రతలు సుమారు 17 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. నగరంలో వాతావరణం సాధారణంగా సమశీతోష్ణ స్థితిలో ఉంటుందని, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉన్నంత చలి ఇక్కడ ఉండదని శ్రీనివాస్‌రావు స్పష్టం చేశారు. మొత్తంగా రాష్ట్రంలో పగటిపూట ఎండలు, రాత్రివేళ చలి కొనసాగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రానున్న రెండు నెలల్లోనూ ఈ భిన్నమైన వాతావరణ పరిస్థితులు కొనసాగవచ్చన్న వాతావరణశాఖ అంచనాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.



మూడు దశాబ్దాలైనా.. రాజీవ్ హత్య ఫొటో చూడలేదు

న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా:

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దారుణ హత్యకు సంబంధించిన ఆయన మృతదేహం ఫొటోను ఇప్పటివరకు తాను చూడలేదని కాంగ్రెస్ అగ్రనేత, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) అధ్యక్షురాలు సోనియా గాంధీ వెల్లడించారు. భర్త మరణించి మూడు దశాబ్దాలు దాటినా ఆ విషాదకర చిత్రాన్ని తన కంట పడకుండా కుమారుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రా ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారని తెలిపారు. తన ఆత్మ కథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'లో ఈ విషయాలను భావోద్వేగంగా పంచుకున్నారు.1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో ఎన్నికల ప్రచార సభకు హాజరైన సమయంలో రాజీవ్ గాంధీ హత్యకు గురయ్యారు. ఎల్‌టీటీఈకి చెందిన మహిళా ఆత్మాహుతి దళ సభ్యురాలు పూలమాల వేసే నెపంతో ఆయన వద్దకు చేరుకుని, శరీరానికి అమర్చుకున్న పేలుడు పదార్థాలతో దాడి చేసింది. ఈ ఘోర ఘటనలో రాజీవ్ గాంధీతో పాటు మరో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశ రాజకీయ చరిత్రలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పేలుడు అనంతరం రాజీవ్ గాంధీ మృతదేహానికి సంబంధించిన ఫొటోలు అప్పట్లో పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ఆ తర్వాత కూడా పలు సందర్భాల్లో అవి మళ్లీ ప్రచురితమయ్యాయి. అయితే ఆ చిత్రాలు తన కంట పడకుండా రాహుల్, ప్రియాంక ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని సోనియా వెల్లడించారు. తనకు నేరుగా దినపత్రికలు, మ్యాగజైన్లు ఇవ్వకుండా సిబ్బందికి పిల్లలు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ముందుగా ప్రతి పత్రికను పరిశీలించిన తర్వాతే తనకు అందించేలా చూసుకున్నారని పేర్కొన్నారు. ఆ సమయంలో తాను చిన్నపిల్లలా ఉంటే, రాహుల్, ప్రియాంక తల్లిదండ్రుల్లా మారి తనను కాపాడుకున్నారని సోనియా భావోద్వేగంగా రాసుకొచ్చారు. మూడు దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ ఆ ఫొటోను చూడలేదని వెల్లడించారు.



రాహుల్ నవ్వుతో ఇందిరాగాంధీ అలసట మాయం

ఆత్మకథలో రాహుల్ గాంధీ బాల్య జ్ఞాపకాలను కూడా సోనియా పంచుకున్నారు. పుట్టినప్పుడు చాలా సన్నగా ఉన్న రాహుల్.. ఆ తర్వాత బుగ్గలు, డబుల్ చిన్‌తో బొద్దుగా మారాడని గుర్తుచేసుకున్నారు. కుటుంబ సభ్యులందరికీ, ముఖ్యంగా నానమ్మ ఇందిరాగాంధీకి రాహుల్ అంటే ఎంతో ఇష్టమని తెలిపారు.రోజంతా రాజకీయాలు, దేశ వ్యవహారాలతో బిజీగా గడిపి ఇంటికి వచ్చే ఇందిరాగాంధీ.. రాహుల్‌ను చూడగానే అలసట మరిచి చిరునవ్వులు చిందించేవారని చెప్పారు. ఇంటికి రాగానే మనవడిని ఎత్తుకొని ఆడించేవారని, రాహుల్ ఆమెను గట్టిగా పట్టుకోవడం, జుట్టు లాగడం వంటి అల్లరి పనులను కూడా ఇందిర ఎంతో ఆనందంగా ఆస్వాదించేవారని పేర్కొన్నారు. రాహుల్‌కు ఆరోగ్యం బాగోలేదని తెలిసినా ఇందిర తీవ్ర ఆందోళన చెందేవారని, ఎక్కడ ఉన్నా అతడి ఆరోగ్యం గురించి తెలుసుకునేవారని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

రాహుల్‌కు ముందు మరో బిడ్డ.. ఒక్కరోజులోనే విషాదం

తన వ్యక్తిగత జీవితంలోని అత్యంత బాధాకరమైన సంఘటనను కూడా సోనియా ఈ పుస్తకంలో వెల్లడించారు. రాహుల్ గాంధీ కంటే ముందు తమకు ఓ మగబిడ్డ జన్మించాడని, అయితే పుట్టిన మరుసటి రోజే ఆ శిశువు మరణించాడని తెలిపారు.1968 సెప్టెంబరులో తాను గర్భం దాల్చిన విషయం తెలియడంతో కుటుంబంలో ఎంతో సంతోషం నెలకొందని పేర్కొన్నారు. సాధారణంగా గంభీరంగా ఉండే ఇందిరాగాంధీ కూడా ఆ వార్త విని భావోద్వేగానికి గురై తనను ఆప్యాయంగా హత్తుకున్నారని గుర్తుచేసుకున్నారు. అయితే గర్భధారణ గడువు కంటే రెండు నెలల ముందుగానే 1969 జనవరి 18న సాధారణ ప్రసవం ద్వారా మగబిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు. దురదృష్టవశాత్తూ ఆ శిశువు మరుసటి రోజే కన్నుమూశాడని ఆవేదన వ్యక్తం చేశారు.ఆ పసికందు భౌతికకాయాన్ని రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ కలిసి మెహ్రౌలీలోని ఫిరోజ్ గాంధీ ఫామ్‌హౌస్‌లో ఖననం చేశారని సోనియా తన ఆత్మకథలో పేర్కొన్నారు. రాజకీయ జీవితానికి అతీతంగా తన కుటుంబంలో చోటుచేసుకున్న ఆనందాలు, విషాదాలు, మరచిపోలేని జ్ఞాపకాలను 'బిలాంగింగ్' పుస్తకం ద్వారా ఆమె పాఠకులతో పంచుకున్నారు.

మత్తులో మునుగుతున్న యువత..
చీకట్లోకి భవిత

తరువాయి భాగం

అలవాటు క్రమంగా ఇతర మత్తు పదార్థాల వైపు మళ్లుతుండటం ఆందోళనకరంగా మారింది.వుట్టినరోజు వేడుకలు, వీకెండ్ పార్టీలు, స్నేహితుల సమావేశాల పేరుతో కొందరు యువకులు ఫామ్‌హౌస్‌లలో మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి.చేవెళ్ల సమీపంలోని ఓ ఫామ్‌హౌస్‌పై పోలీసులు దాడి చేయగా ఏకంగా 108 మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో నలుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయింది. ముఖ్యంగా హాస్టళ్లలో ఉంటూ కుటుంబాలకు దూరంగా చదువుకుంటున్న విద్యార్థులు స్నేహితుల ప్రభావంతో చెడు అలవాట్లకు లోనవుతున్నట్లు పోలీసులు గుర్తించారు.మత్తు పదార్థాల వినియోగమే కాకుండా వాటి సరఫరా కూడా పోలీసులకు సవాలుగా మారుతోంది. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో కొందరు విద్యార్థులే గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. విద్యాసంస్థల్లో పనిచేసే కొందరు సిబ్బంది సైతం డబ్బుకు ఆశపడి గంజాయి విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్రగ్స్ సరఫరా చేసే ముఠాల నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన చోట డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తూ ఆధారాలు సేకరిస్తున్నారు.డ్రగ్స్ ముఠాల కార్యకలాపాలను అరికట్టడం పోలీసులకు సవాలుగా మారుతోందని విశ్రాంత ఎస్పీ రెడ్డన్న అభిప్రాయపడ్డారు. 2 వేల మందికి పరీక్షలు నిర్వహిస్తే 1,400 మందికి పాజిటివ్ వచ్చిందని, అనుమానితుల్లో సుమారు 60 శాతం మంది డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తేలిందని పేర్కొన్నారు. డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలను పట్టుకోవాలంటే ఐదు నుంచి ఆరు నెలల పాటు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించాల్సి ఉంటుందని వివరించారు.

డ్రగ్స్‌కు అలవాటుపడిన విద్యార్థులను గుర్తించడంతో పాటు వారిని ఆ వ్యసనం నుంచి బయటపడేయడం కూడా ఎంతో కీలకం. అయితే తమ పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలయ్యారనే విషయం బయటపడితే పరువు పోతుందనే భయంతో కొందరు తల్లిదండ్రులు చికిత్సకు వెనకాడుతున్నారు. దీనివల్ల సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మెలగాలని, వారి రోజువారీ కార్యకలాపాలు, స్నేహితులు, అలవాట్లపై అవగాహన కలిగి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.మత్తుకు బానిసైన వారిని నేరస్థులుగా చూడకుండా డీఅడిక్షన్ కేంద్రాల ద్వారా సరైన చికిత్స అందించాలి. మరోవైపు డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాలపైకఠిన చర్యలు తీసుకోవాలి.పోలీసుల నిఘాతో పాటు తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, సమాజం సమన్వయంతో పనిచేస్తేనే యువతను మత్తు కోరల నుంచి కాపాడే అవకాశం ఉంటుంది. చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాల్సిన యువత మత్తులో మునిగిపోతుంటే.. వారి భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత కుటుంబాలతో పాటు సమాజంపైనా ఉంది.



తెలంగాణ సాగునీటి హక్కులపై
సీఎం ప్రత్యేక దృష్టి

తరువాయి భాగం


(సీడబ్ల్యూసీ) అనుమతులు పొందడంతో పాటు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటాను సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో తెలంగాణ తరఫున సమర్థంగా వాదనలు వినిపించాలని, ఆంధ్రప్రదేశ్‌తో వివాదం ఉన్న అన్ని అంశాలకు సంబంధించిన ఆధారాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ నెల 18 తర్వాత సుప్రీంకోర్టులో కేసు విచారణ జరగనున్న నేపథ్యంలో న్యాయ నిపుణులతో సమగ్రంగా చర్చించాలని ఆదేశించారు.

డిండి, అచ్చంపేట సాగునీటి పథకాల పనులను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి, అచ్చంపేట పథకాలకు నీటిని అందించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నార్లాపూర్ నుంచి ఏదుల వరకు 0.6 టీఎంసీల నీటిని తరలించే విధంగా డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో న్యాయపరమైన, సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ముందుకు వెళ్లాలని సీఎం సూచించారు.

ప్రభుత్వ ఖజానా కొల్లగొడుతున్న దొంగలు...

- నిద్రమత్తు వదలని యంత్రాంగం!
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా జీఎస్టీ, ఐటీ ఎగవేతలు
- బడా విద్యాసంస్థలు, రియల్ ఎస్టేట్ మాఫియా, పొలిటికల్ లీడర్ల దందాలు..
- కార్పొరేట్ చదువులు.. కల్తీ రిజిస్ట్రేషన్లు.. అడుగడుగునా నల్లధనం మయం!
- ఖద్దరు నీడలో కంటికి కనిపించని ఏసీబీ.. నోట్ల కట్టలతో తడిసిన యంత్రాంగం!
- బినామీ బకాసూర్ల గుట్టు రట్టు చేసేదెవరు.. ఖజానా దోపిడీకి చెక్ పెట్టేదెప్పుడు?
- లంచాల మత్తులో ఏసీబీ నిద్ర.. అవినీతి బకాసూర్లకు అభయహస్తం!
- బినామీ బడా పోకిరీల పై ఉక్కుపాదం ఏది.. నిమ్మకు నీరెత్తిన పాలక యంత్రాంగం!
- నిమ్మకు నీరెత్తిన ఏసీబీ, పన్నుల శాఖలు



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :

ప్రభుత్వానికి రావాల్సిన కోట్లాది రూపాయల ఆదాయానికి అక్రమార్కులు పగటిపూటే గండి కొడుతుంటే.. ఖాకీ, ఖద్దరు నీడలో సాగుతున్న ఈ అక్రమ సామ్రాజ్యాన్ని చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై జిల్లా వ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. తిండికి లేని అమాయకుల పేర్లను బినామీలుగా వాడుకుంటూ బడా రాజకీయ నాయకులు, పన్ను ఎగవేతదారులు లక్షల కోట్లు కూడబెడుతుంటే సంబంధిత యంత్రాంగం ఏం చేస్తోందనే ప్రశ్నలు జిల్లా సరిహద్దుల వరకు మారుమోగుతున్నాయి.

విద్యాసంస్థలు, రియల్ ఎస్టేట్ దందాల్లో నల్లధనం పరదా! జిల్లా మూలమూలలా కార్పొరేట్ విద్యాసంస్థలు, రియల్ భూబకాసూర్లు, బడా పొలిటికల్ లీడర్లు జీఎస్టీ, ఐటీ నిబంధనలను బహిరంగంగా గాలికొదిలేశారు.

కార్పొరేట్ విద్యాసంస్థలు

విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డొనేషన్లు, అడ్మిషన్ల పేరిట లక్షలు గుంజుతున్న బడా విద్యాసంస్థలు.. రూపాయికి కూడా పక్కా జీఎస్టీ బిల్లులు ఇవ్వకుండా కోట్ల సొమ్మును బ్లాక్ మనీగా మారుస్తున్నాయి.

రియల్ ఎస్టేట్ మాఫియా

అక్రమ వెంచర్లు, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే అండర్ వాల్యూ రిజిస్ట్రేషన్లతో ఐటీ , జీఎస్టీకి ఏమార్చుతూ కోట్లాది రూపాయల నల్లధనాన్ని

కనిపించని ఏసీబీ.. లంచాల దందాలో నలిగిపోతున్న జనం..!

ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం ఇస్తే తప్ప పని జరగని దుస్థితి దాపురించింది. పన్ను ఎగవేతదారులు, అవినీతి ఉద్యోగులు ఏసీబీ (అవినీతి నిరోధక బ్యూరో)కి దొరకుండా తెరవెనుక చక్రం తిప్పుతుంటే.. జిల్లాలో అవినీతి నిరోధక శాఖ ఉనికిలోనే ఉందా లేదా అనే అనుమానాలు కలుగుతున్నాయి. అక్రమార్కులకు వెనుకుండి అభయహస్తం ఇస్తున్న అధికారుల మౌనం వెనుక ఉన్న "అసలు మతలబు" ఏంటని జిల్లా ప్రజలు నిలదీస్తున్నారు.

విచ్చలవిడిగా చెలామణి చేస్తున్నారు.

బినామీ సామ్రాజ్యం

ఎలాంటి ఐటీ రిటర్న్స్ దాఖలు చేయకుండా కోట్ల వ్యాపారాలు చేస్తున్నా, అక్రమ ఆస్తులను బినామీల పేరిట కూడబెడుతున్నా వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు కంటికి కనిపించకపోవడం విడ్డూరంగా మారింది.

ఉక్కుపాదం మోపకపోతే ప్రజాక్షేత్రంలో నిరసనలే..!

ప్రజాధనాన్ని కబళిస్తూ, పన్ను ఎగవేస్తూ విలాసవంతమైన జీవితాలు గడుపుతున్న కేటుగాళ్లపై ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాలి. ఐటీ, జీఎస్టీ, ఏసీబీ అధికారులు సంయుక్తంగా రంగంలోకి దిగి.. కార్పొరేట్ విద్యాసంస్థలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వారికి అండగా ఉంటున్న అవినీతి అధికారుల గుట్టు రట్టు చేయాలి. బినామీ ఆస్తులను జప్తు చేసి ప్రభుత్వ ఖజానాను కాపాడకపోతే జిల్లా వ్యాప్తంగా ప్రజాందోళనలు తప్పవని ప్రజలు హెచ్చరిస్తున్నారు!

అశ్వారావుపేట అభివృద్ధికి రూ.48.72 కోట్లు మంజూరు చేయండి

- ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రతిపాదనలు
- 22 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ.35.52 కోట్లు కోరిన ఎమ్మెల్యే

అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా:

అశ్వారావుపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక దృష్టి సారించారు. మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.48.72 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరికి ప్రతిపాదనలు అందజేశారు.ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్‌రెడ్డి, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబుతో కలిసి మంత్రిని కలిసిన ఎమ్మెల్యే..పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలను వివరించారు.

22 వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం


మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 22 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ.35.52 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. భగత్‌సింగ్ సెంటర్ నుంచి అంబేద్కర్ నగర్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా వర్షపు నీటి కాలువల నిర్మాణానికి రూ.5.87 కోట్లు, మరో నాలుగు వార్డుల్లో ప్రధాన డ్రెయిన్ల నిర్మాణానికి రూ.4.33 కోట్లు మంజూరు చేయాలని కోరారు.

పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలకు ప్రాధాన్యం

పట్టణంలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు జేసీబీ, డోజర్, ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోల కొనుగోలుకు రూ.2 కోట్లు ప్రతిపాదించారు. ఎల్ ఈడీ వీధి దీపాల ఏర్పాటుకు రూ.25 లక్షలు, నిరంతర మంచినీటి సరఫరా కోసం పైప్‌లైన్ల నిర్మాణానికి రూ.50 లక్షలు, సబ్‌మెర్సిబుల్ మోటార్లు, పంపుసెట్ల ఏర్పాటుకు మరో రూ.25 లక్షలు కేటాయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.పట్టణ ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ,నిరంతర తాగునీటి సరఫరా, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ఈ ప్రతిపాదనల ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే అశ్వారావుపేట పట్టణ అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.







ఆక్రమణల నుంచి ఆహ్లాదకర ప్రాంతంగా..

తమ్మిడికుంటకు పూర్వవైభవం

- రూ.20 కోట్లతో చెరువు పునరుద్ధరణ..
- నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఐటీ కారిడార్‌లో వాకింగ్ ట్రాక్, రోజ్ గార్డెన్, యోగా వేదిక ఏర్పాటు

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని మాదాపూర్ శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట చెరువుకు తిరిగి పూర్వవైభవం వచ్చింది. దశాబ్దాలుగా ఆక్రమణలతో కుంచించుకుపోయిన ఈ చెరువును హైడ్రా ప్రత్యేక చొరవతో రూ.20 కోట్ల వ్యయంతో సుందరంగా అభివృద్ధి చేసింది. పునరుద్ధరణ పనులు పూర్తికావడంతో నేడు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా చెరువును ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపుతో పెరిగిన చెరువు విస్తీర్ణం

ఒకప్పుడు దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తమ్మిడికుంట చెరువు ఆక్రమణల కారణంగా 14 ఎకరాలకు కుంచించుకుపోయింది. ఎన్ కన్వెన్షన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని అక్రమ నిర్మాణాలను తొలగించడంతో మరో 16 ఎకరాల భూమి తిరిగి చెరువు పరిధిలోకి వచ్చింది. దీంతో చెరువు పునరుద్ధరణకు మార్గం సుగమమైంది.

సందర్శకుల కోసం ప్రత్యేక సౌకర్యాలు

రూ.20 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా చెరువు చుట్టూ 1.25 కిలోమీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్‌ను నిర్మించారు. ట్రాక్‌కు ఇరువైపులా పచ్చని మొక్కలు, ల్యాండ్‌స్కేపింగ్‌తో ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించారు. సందర్శకుల కోసం బెంచీలు, యోగా వేదిక, గెజిబోలు, రోజ్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా కేవలం వర్షపు నీరు మాత్రమే వచ్చేలా ప్రత్యేక డ్రైనేజీ వ్యవస్థను రూపొందించారు.

సీఎం పర్యటన.. ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

తమ్మిడికుంట ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్‌తో కలిసి సభా ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బహిరంగ సభ వేదిక, వీఐపీ సీటింగ్, పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకల మార్గాలను సమీక్షించారు. ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

మరో 14 చెరువుల అభివృద్ధికి ప్రణాళిక


తమ్మిడికుంట పునరుద్ధరణ నేపథ్యంలో నగరంలోని మరో 14 చెరువులను రెండో విడతలో అభివృద్ధి చేయాలని హైడ్రా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందుకోసం సుమారు రూ.300 కోట్ల అంచనా వ్యయాన్ని ప్రతిపాదించింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పనులు ప్రారంభించగా, కోర్టు కేసులు పరిష్కారమైన వెంటనే మిగిలిన చెరువుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయనున్నారు.నగర విస్తరణలో కనుమరుగవుతున్న చెరువులను కాపాడటంతో పాటు, వాటిని ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే ప్రాంతాలుగా తీర్చిదిద్దే దిశగా తమ్మిడికుంట పునరుద్ధరణ ఒక కీలక ముందడుగుగా నిలవనుంది.

పట్టభద్రులను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ గౌడ్

హనుమకొండ, తెలంగాణ చౌరస్తా:

వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పాలకూరి అశోక్ కుమార్ గౌడ్ మంగళవారం వరంగల్ జిల్లాలో పర్యటించారు.కాకతీయ విశ్వవిద్యాలయంతో పాటు పలు కార్యాలయాలు,విద్యాసంస్థలను సందర్శించి పట్టభద్రులు,నిరుద్యోగ యువతను కలిశారు.వారి సమస్యలను తెలుసుకుని తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... నిరుద్యోగం,ఉద్యోగ అవకాశాలు,ఉద్యోగ భద్రత వంటి సమస్యలపై శాసనమండలిలో గళం వినిపిస్తానని తెలిపారు.బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగాలని,వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.అనంతరం హనుమకొండలోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రాంతీయ కార్యాలయానికి చేరుకున్న అశోక్ గౌడ్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజిని కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్,గొర్రె సందీప్,తానం రామన్ కుమార్ పటేల్,పోలురాజు,చందు తదితరులు పాల్గొన్నారు.





ఏ ఐ పి ఎస్ యు జిల్లా కమిటీ ఎన్నిక

- జిల్లా అధ్యక్షకార్యదర్శులుగా సి.హెచ్ మల్లేష్,మిట్టపల్లి తిరుపతి
- విద్యార్థి హక్కుల కోసం | ఉద్యమాలే లక్ష్యం
- విద్యార్థి సమస్యల పరిష్కారానికి పోరాటమే అజెండా
- ఏ ఐ పి ఎస్ యు నూతన జిల్లా కమిటీ

మంచిర్యాల, తెలంగాణ చౌరస్తా:

అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏ ఐ పి ఎస్ యు) మంచిర్యాల్ జిల్లా అధ్యక్షుడిగా సి.హెచ్. మల్లేష్,జిల్లా ప్రధాన కార్యదర్శిగా మిట్టపల్లి తిరుపతిలను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బోడ అనిల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నే కుమార్ ప్రకటించారు.విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూ,విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న వీరి సేవలను గుర్తించి,ఈ నెల 5వ తేదీన రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర ఆఫీస్ బెరర్ (ఓబి) సమావేశంలో ఈ నియామకాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు.ఈ నిర్ణయాన్ని మంగళవారం మంచిర్యాల్ జిల్లా నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో అధికారికంగా ప్రకటించారు.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ... తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.ఇప్పటివరకు పూర్తి స్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను విరమించి,నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ ఈ పి) ను రద్దు చేసి,సమాన అవకాశాలు కల్పించే శాస్త్రీయ,విద్యా విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో మెస్,కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని,అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు శాశ్వత సొంత భవనాలు నిర్మించాలని,పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని,విద్యార్థులను వేధిస్తున్న ప్రైవేట్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ డిమాండ్ల సాధన కోసం రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అనంతరం నూతనంగా నియమితులైన జిల్లా అధ్యక్షుడు సి.హెచ్. మల్లేష్,ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ...తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.మంచిర్యాల్ జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం,మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడం, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల,మంచిర్యాల్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల స్థాపన,నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన,ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడం,ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయించడం వంటి అంశాలపై ఉద్యమాలు చేపడతామని తెలిపారు.విద్యార్థుల హక్కుల పరిరక్షణ,నాణ్యమైన విద్య, సమాన అవకాశాల కోసం ఏఐపిఎస్ యు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులను సంఘటితం చేసి ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని,విద్యార్థుల పక్షాన అండగా నిలుస్తామని నూతన జిల్లా కమిటీ స్పష్టం చేసింది.



మహిళా భద్రతకు కొత్త భరోసా



- గచ్చిబౌలిలో ప్రత్యేక కేంద్రం ప్రారంభం
- ఒకే భవనంలో షీ టీమ్స్, భరోసా కేంద్రం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం
- ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్..
- బాధితులకు రక్షణ, కౌన్సెలింగ్, న్యాయ సహాయం

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

మహిళలు, చిన్నారుల భద్రతకు మరింత భరోసా కల్పించే లక్ష్యంతో సైబరాబాద్ పోలీసులు గచ్చిబౌలిలో నిర్మించిన మహిళా, శిశు భద్రతా విభాగం ప్రత్యేక భవనాన్ని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ మంగళవారం ప్రారంభించారు.మహిళలు,చిన్నారులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి వీలుగా ఒకే భవనంలో పలు కీలక విభాగాలను ఏర్పాటు చేశారు. ఇందులో షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, భరోసా కేంద్రం, మహిళా అభివృద్ధి, సాధికారత కేంద్రాలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

బాధితులకు ఒకే చోట అన్ని సేవలు

రహేజా గ్రూప్ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఈ ప్రత్యేక భవనం ద్వారా వేధింపులకు గురైన మహిళలకు అవసరమైన రక్షణ, కౌన్సెలింగ్, న్యాయపరమైన సహాయం అందించనున్నారు. వివిధ విభాగాలను ఒకే చోట ఏర్పాటు చేయడంతో బాధితులకు సత్వర సేవలు అందించేందుకు అవకాశం కలగనుంది. మహిళలు, చిన్నారులపై వేధింపులు, అక్రమ రవాణా వంటి సమస్యలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ కేంద్రం కీలకంగా నిలవనుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. సృజన, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.



తెలంగాణలో అధికారమే లక్ష్యం..

తరువాయి భాగం

పడేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

కొత్త నియామకాలు పూర్తయిన తర్వాత రాష్ట్ర కమిటీలో ప్రస్తుతం ఉన్న నేతల బాధ్యతల్లోనూ మార్పులు జరిగే అవకాశం ఉంది. జిల్లాల వారీగా పార్టీ విస్తరణ, సంస్థాగత నిర్మాణం, ప్రజా సమస్యలపై పోరాటాలు, వివిధ మోర్చాల సమన్వయం వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సమాచారం. కొత్తగా బాధ్యతలు చేపట్టే నేతలకు కూడా నిర్దిష్ట లక్ష్యాలను అప్పగించే అవకాశముంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నెలకొన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మలుచుకోవాలని బీజేపీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ దిశగా ఇప్పటికే రాష్ట్రంలో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేస్తోంది. ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన, పాదయాత్ర నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో రాజకీయ కార్యకలాపాలు మరింత ఊపందుకున్నాయి.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి

కేవలం రాష్ట్ర స్థాయి పదవుల భర్తీతోనే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. ప్రతి జిల్లాలో నాయకులు, కార్యకర్తలకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించడం, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై దృష్టి సారించనుంది. కొత్త పదవుల భర్తీతో రాష్ట్ర బీజేపీలో ఎలాంటి రాజకీయ సమీకరణాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలి.



హసీనాకు చుట్టుముడుతున్న ఉచ్చు..

తరువాయి భాగం

తెలుస్తోంది.

బంగ్లాదేశ్ పాస్‌పోర్టు ఆర్డర్ 1973 ప్రకారం మరణశిక్ష పడిన వ్యక్తులకు ప్రయాణ పత్రాలు జారీ చేయడంపై ఆంక్షలు ఉన్నాయని అమీన్ ఉల్ ఇస్లాం తెలిపారు. హసీనా బంగ్లాదేశ్‌కు రావాలనుకుంటే విచారణ సమయంలోనే వచ్చి కేసును ఎదుర్కోవాల్సిందని వ్యాఖ్యానించారు. తీర్పు వెలువడిన 30 రోజుల్లో అప్పీల్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఆమె ఆ మార్గాన్ని అనుసరించలేదని పేర్కొన్నారు. భారత్ నుంచి తిరిగి వెళ్లాలనుకుంటే అప్పగింత ఒప్పందం ప్రకారం భారత ప్రభుత్వాన్ని ఆశ్రయించాలని సూచించారు.

మరోవైపు షేక్ హసీనా అధికారికంగా పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేశారన్న వార్తలను బంగ్లాదేశ్ ప్రధాని సమాచార, ప్రసార వ్యవహారాల సలహాదారు జాహెద్ ఉర్ రెహ్మాన్ ఖండించారు. ఒక న్యాయ సంస్థ పాస్‌పోర్టు జారీకి అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరుతూ లేఖ మాత్రమే పంపిందని, హసీనా నేరుగా ఎలాంటి దరఖాస్తు చేయలేదని వివరించారు. ఈ అభ్యర్థన చట్టబద్ధత, విధివిధానాలపై సంబంధిత శాఖలు పరిశీలన జరుపుతున్నాయని హోంమంత్రి సలాహుద్దీన్ అహ్మద్ తెలిపారు. 2024 ఆగస్టులో విద్యార్థుల నేతృత్వంలో జరిగిన భారీ నిరసనలు, ప్రజా తిరుగుబాటుతో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం కూలిపోయింది. ఆ సమయంలో దేశం విడిచిన ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. నిరసనకారులపై జరిగిన హింసాత్మక అణచివేతకు సంబంధించిన కేసులో ఆమె గైర్హాజరీలోనే బంగ్లాదేశ్ కోర్టు మరణశిక్ష విధించింది. అయితే తనపై జరుగుతున్న విచారణ చట్టబద్ధతను హసీనా ప్రశ్నిస్తున్నారు.

2024లో జరిగిన అణచివేత చర్యల్లో సుమారు 1,400 మంది మరణించి ఉండొచ్చని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. ఈ కేసులో హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం పలుమార్లు భారత్‌ను కోరింది. ఈ విజ్ఞప్తులు అందినట్లు ధ్రువీకరించిన భారత ప్రభుత్వం.. చట్టపరమైన, దౌత్యపరమైన ప్రక్రియల ద్వారా అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. మరోవైపు ఫిబ్రవరిలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

అర్హులకందని ఇందిరమ్మ ఇళ్లు!


- భారీ వర్షా లకు కూలిన నిరుపేద కుటుంబం నివాసం..
- నిలువ నీడ కరువు
- అర్హత ఉన్నా అందని ప్రభుత్వ పథకం..
- అధికారుల చొరవ కోసం బాధిత కుటుంబం ఎదురుచూపు

సైదాపూర్ తెలంగాణ చౌరస్తా :-



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నిజమైన అర్హులకు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కొందరు నిరుపేదలకు మాత్రం నిరాశే మిగులుతోంది. ఇందుకు నిదర్శనంగా భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయి, నిలువ నీడ కోల్పోయిన ఓ నిరుపేద కుటుంబం పరిస్థితి కనిపిస్తోంది.

సైదాపూర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన జేరిపోతుల రాజు ఏళ్ల తరబడి కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ముతో నిర్మించుకున్న చిన్న ఇంటిలో జీవనం సాగిస్తున్న ఆ కుటుంబానికి భారీ వర్షాలు తీరని నష్టాన్ని మిగిల్చాయి. వర్షాల ధాటికి ఇల్లు కూలిపోవడంతో కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. ఒకవైపు కూలిపోయిన ఇంటి శిథిలాలు, మరోవైపు నిత్యావసరాల కోసం పడరాని పాట్లు పడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. కనీసం తలదాచుకునేందుకు సరైన వసతి కూడా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశ పెట్టింది. అయితే, నిజంగా ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇల్లు కూలిపోయి రోడ్డున పడిన కుటుంబానికి ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.ప్రభుత్వ పథకాల అసలు లక్ష్యం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందినప్పుడే వాటి ప్రయోజనం నెరవేరుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బాధిత కుటుంబం పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, అర్హతను నిర్ధారించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు తక్షణ సహాయం అందించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. కూలిన గోడల మధ్య కన్నీటి జీవితం గడుపుతున్న ఆ నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం ఎప్పుడు అండగా నిలుస్తుందో వేచి చూడాల్సిందే!



పెర్క శ్యామ్ కు ఘన సన్మానం

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) అధికార ప్రతినిధిగా ఇటీవల నియమితులైన పెర్క శ్యామ్ ని కాంగ్రెస్ పార్టీ నాయకులు వైట్ హౌస్ లో కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాయకులు శ్యామ్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ,ఆయనకు అభినందనలు తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు గంట రమణారెడ్డి,డీసీసీ ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్,ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షులు మొలుమూరి శ్రీనివాస్,బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు అలవేలి శంకర్,నాయకులు ఎండీ నజీం,టీ. శ్రీధర్,ఏ.రాజశేఖర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు .

రాయదుర్గంలో వివాహిత మహిళ అదృశ్యం

- మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు భర్త ఫిర్యాదు



శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా: రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో వివాహిత మహిళ అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. రాధేనగర్ కాలనీకి చెందిన కందిక సృతిలత (37) నవంబర్ 9వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు.గత నాలుగేళ్లుగా ఆమె మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు భర్త కందిక నాగేశ్వర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇంటి నుంచి వెళ్లే సమయంలో ఆధార్ కార్డు, నగదు, ఇతర వస్తువులు తీసుకెళ్లలేదని, సెల్‌ఫోన్‌ను సైతం ఇంట్లోనే ఛార్జింగ్‌లో ఉంచి వెళ్లినట్లు తెలిపారు.ఆమె ఆచూకీ కోసం గచ్చిబౌలి, మల్కం చెరువు, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు స్వీకరించిన రాయదుర్గం పోలీసులు క్రైం నంబర్ 1280/2026 కింద మహిళ అదృశ్యం కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆమె ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గురుకుల హాస్టల్‌లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ.. వసతులపై అసంతృప్తి!



- 60 మూత్రశాలల్లో 8 మాత్రమే వినియోగంలో
- నీటి సమస్యపై అధికారులకు ఆగ్రహం

ఎల్బీనగర్, తెలంగాణ చౌరస్తా:

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని గడ్డిఅన్నారం డివిజన్ గురుకుల హాస్టల్‌ను స్థానిక ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, భోజన నాణ్యత, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.తనిఖీల్లో హాస్టల్‌లో తీవ్ర నీటి సమస్య ఉన్నట్లు ఎమ్మెల్యే గుర్తించారు. మూడు, నాలుగో అంతస్తుల్లో ఉంటున్న విద్యార్థులు స్వయంగా నీటిని మోసుకెళ్లాల్సి వస్తుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే హాస్టల్‌లోని 60 మూత్రశాలల్లో కేవలం 8 మాత్రమే వినియోగంలో ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగునీరు అందించడం అధికారుల బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. హాస్టల్‌లో గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, నాయకులు రమేష్ ముదిరాజ్, బిచినేపల్లి వెంకటేశ్వరరావు, శ్రీశైలం యాదవ్, రమణారెడ్డి, గండి సన్నియాదవ్, కొత్త రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మియాపూర్ ప్రభుత్వ భూములను విక్రయిస్తే సహించేది లేదు!

- మిగిలిన 400 ఎకరాలు ప్రజా ప్రయోజనాలకే కేటాయించాలి
- ఆసుపత్రి, కళాశాలలు, పార్కులు నిర్మించాలి

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

మియాపూర్‌లోని ప్రభుత్వ భూములను విక్రయించి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తే సహించేది లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మరబోయిన రవికుమార్ యాదవ్ హెచ్చరించారు. మియాపూర్ సర్వే నంబర్లు 100, 101లో ఉన్న ప్రభుత్వ భూములను ప్రజా అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు.మంగళవారం ఎం.ఏ. నగర్ కాలనీని సందర్శించిన ఆయన స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. 1912 నాటి రికార్డుల నుంచే ఈ భూములు ప్రభుత్వ భూములుగా నమోదయ్యాయని, 1949లో జాగీర్ల రద్దుతో ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చాయని వివరించారు. 2003లో హైకోర్టు సైతం ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చిందని, తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వ హక్కు మరింత స్పష్టమైందని పేర్కొన్నారు.

400 ఎకరాలు ప్రజా అవసరాలకే వినియోగించాలి

మొత్తం 550 ఎకరాల ప్రభుత్వ భూముల్లో సుమారు 150 ఎకరాల్లో ఎం.ఏ. నగర్, స్టాలిన్ నగర్ తదితర కాలనీలు ఏర్పడి పేదలు నివసిస్తున్నారని రవికుమార్ యాదవ్ తెలిపారు. మిగిలిన 400 ఎకరాలను విక్రయించకుండా ప్రజా ప్రయోజనాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ భూముల్లో అత్యాధునిక ప్రభుత్వ ఆసుపత్రి, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు, పార్కులు ఏర్పాటు చేయాలని, నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించాలని సూచించారు.

పేదల ఇళ్ల జోలికొస్తే ప్రతిఘటన

వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసం విక్రయించడం అన్యాయమని ఆయన విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే సైతం ప్రభుత్వ భూముల పరిరక్షణకు ముందుకు రావాలని కోరారు. తరతరాలుగా నివసిస్తున్న పేదల ఇళ్ల జోలికి వస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని, బాధితులకు బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే శేరిలింగంపల్లి నుంచే పోరాటాన్ని ప్రారంభించి, బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మాణిక్‌రావు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు విజయేందర్, డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్, శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సీతారామరాజు, గణేష్ ముదిరాజ్, రాఘవేంద్రరావు, నాగేశ్వర్‌గౌడ్, సమ్మెట ప్రసాద్, మహేష్ యాదవ్, రాజేష్‌గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



అయ్యప్ప పడిపూజకు కేటీఆర్‌కు ఆహ్వానం

- నేతాజీనగర్‌లో ఈ నెల 15న ప్రత్యేక పూజా కార్యక్రమం

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

నేతాజీనగర్ గుల్మోహర్ పార్క్‌లో ఈ నెల 15న నిర్వహించనున్న అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకుడు గుర్ల తిరుమలేష్ కేటీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా పడిపూజ కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని కేటీఆర్ తెలిపినట్లు గుర్ల తిరుమలేష్ వెల్లడించారు.అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమానికి హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో వాకిటి శంకర్, వడ్డే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు వద్ద బీరు సీసాతో దాడి

- మద్యం మత్తులో ముఖంపై విచక్షణారహితంగా దాడి.. బాధితుడికి తీవ్ర గాయాలు
- మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ అపోలో ఆసుపత్రికి తరలింపు

అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా:



స్థలం విషయంలో తలెత్తిన వివాదం మద్యం మత్తులో ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో ఓ వ్యక్తిపై బీరు సీసాతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఘటన అశ్వారావుపేటలో చోటు చేసుకుంది. అశ్వారావుపేట ఏఎస్ఆర్ కాలనీకి చెందిన దాచేపల్లి వీరభద్రం స్థానిక పేపర్ బొడ్డు వద్ద ఉన్న బెల్టు షాపులో మద్యం సేవిస్తుండగా, అక్కడే ఉన్న పసుపులేటి రామస్వామితో స్థలం విషయమై వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఆగ్రహానికి గురైన రామస్వామి పక్కనే ఉన్న బీరు సీసాతో వీరభద్రం ముఖంపై విచక్షణారహితంగా దాడి చేశాడు.ఈ దాడిలో వీరభద్రం ముఖానికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. వెంటనే స్పందించిన బాధితుడి భార్య, కుమారులు చికిత్స నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి చిన్న కుమారుడు దాచేపల్లి ధర్మతేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎం. కృష్ణమూర్తి కేసు నమోదు చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.50 లక్షల విరాళం

- ఆప్టిమస్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డి ఉదారత
- విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు వినియోగం

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌లో విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ఆప్టిమస్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డి రూ.50 లక్షల విరాళం అందించారు. మంగళవారం మైండ్‌స్పేస్‌లో నిర్వహించిన ఓపెన్ హౌస్ సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్‌కు విరాళం చెక్కును అందజేశారు. ఈ విరాళం నిధులతో పాఠశాలలో తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా ప్రాంగణం, డిజిటల్ విద్యా సదుపాయాలను మరింత అభివృద్ధి చేయనున్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.ఈ సందర్భంగా డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డిని డీజీపీ సీవీ ఆనంద్ అభినందించారు. పాఠశాల అభివృద్ధికి మరింత మంది దాతలు ముందుకొచ్చి తమ వంతు సహకారం అందించాలని కోరారు.పోలీసు కుటుంబాల పిల్లలతో పాటు సాధారణ కుటుంబాలకు చెందిన పిల్లలకు సైతం నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యమని డాక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. సృజన తదితరులు పాల్గొన్నారు.



డీసీసీ అధ్యక్షున్ని కలిసిన గూడూరు సతీష్ కుమార్

- ఎమ్మెల్సీ ఎన్నికలు,స్థానిక పరిస్థితులపై సాగిన చర్చలు

హనుమకొండ, తెలంగాణ చౌరస్తా :



హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామిరెడ్డిని జిల్లా కాంగ్రెస్ నాయకులు గూడూరు సతీష్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలు,పార్టీ రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.దీనిపై ఇనుగాల వెంకట్రామిరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ పలు విలువైన సూచనలు చేశారు.భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం చేపట్టే కార్యక్రమాలకు తన పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.ప్రజాక్షేత్రంలో నిరంతరం ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ,పరకాల నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకొస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ఇనుగాల వెంకట్రామిరెడ్డి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఈ సందర్భంగా గూడూరు సతీష్ కుమార్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కేయూ జాక్ నాయకులు యుగేందర్,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.